క్లుప్తంగా

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉండండి



గుడివాడ టౌన్: ఉభయ గోదావరి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వ్యాపించిన బర్డ్‌ఫ్లూ కృష్ణా జిల్లాకు వచ్చే ప్రమాదం ఉందని పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎన్‌సీహెచ్ నర్సింహులు పేర్కొన్నారు. పట్టణంలోని పలు చికెన్ సెంటర్లలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్ సెంటర్ల యజమానులు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. పక్క జిల్లాల కోళ్లను ఈ జిల్లాలో విక్రయించవద్దని, షాపుల్లో కోళ్లు నిల్వ ఉంచే ప్రాంతాల్లో శానిటేషన్‌పై దృష్టిపెట్టాలని, కోడి కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ వైద్యులు డాక్టర్ కేసీ వెంకటరెడ్డి, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తొలగింపు



కురుమద్దాలి(పామర్రు): మండలంలోని కురుమద్దాలిలోని విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి పక్కనే ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారని ఈ నెల 8వ తేదీన సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. స్పందించిన గ్రామ కార్యదర్శి అంజనాదేవి పంచాయతీ సిబ్బందితో ఫ్లెక్సీని తొలగించారు.

ఘనంగా ఉరుసు



పామర్రు: స్థానిక హజరత్ జయావుల్ హక్ లీమా అల్లా మొహిబుల్లాషా చిష్తి వారి ఉరుసు మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత హజ్రత్ సుల్తాన్ ఖలీఫా ఇంటి వద్ద నుంచి గంధము, చాదర్, పూలు, మిఠాయిలు తీసుకుని గ్రామ పురవీధుల్లో దర్గా వద్దకు ఊరేగింపుగా బయలుదేరారు. దర్గాకు చేరుకుని గంధము, చాదర్‌ను సమర్పించి ఫాతెహా కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు ఆలీ ఆసిఫ్ ఖాన్, ఆలీ ఆఫ్తాబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దర్గా వద్ద నందా ఫాతిమా తదుపరి హజరత్ మోహబుల్లా షిష్టి ప్రసాదం పంపిణీ చేశారు.అనంతరం దర్గాలో నిర్వహించిన ఎండీ ఖలీల్ రెహమ్మాన్ పార్టీ, షేక్ ఇస్మాయిల్ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన పాటల కచేరీ ఆహూతులను ఆకట్టుకుంది.

'ఏఎన్నార్' విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: ఏ పోటీ పరీక్షల్లోనైనా ఏఎన్నార్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి విజేతలుగా నిలుస్తున్నారని కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు అన్నారు. మంగళవారం కళాశాల కార్యాలయంలో విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ ఎక్కౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన మాయాక్–2025 రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు మహ్మద్ నూరుల్లా, నక్కా సాయిభరత్‌ల బృందం ద్వితీయ బహుమతి సాధించారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.

లోకుమూడి భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ

మండవల్లి: లోకుమూడి హైస్కూల్లో ఉన్న భవిత సెంటర్‌లో మంగళవారం డాక్టర్ కె సునీత ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఫిజియోథెరపీ చేశారు. ప్రతిరోజూ చిన్నారులకు వారి తల్లిదండ్రులు ఇళ్ల వద్ద ఉదయం, సాయంత్రం నూనె రాసి శిబిరంలో మాదిరిగా వ్యాయామాలు చేయించాలని ఫిజియోథెరపిస్ట్ సూచించారు. హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఐఈఆర్‌టీలు అరుణకుమారి, వసంత, శైలజ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసు

ముదినేపల్లి రూరల్ : దేవపూడిలో ఒక వ్యక్తిపై దాడి జరిగిన ఘటనకు సంబంధించి స్థానికులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన పాలడగు నాగవెంకటసతీష్ తన గేదెలను తోలుకుని తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన గిరిధర్ కొన్ని వ్యాఖ్యలు చేసి చేతిలోని కర్రతో సతీష్‌పై దాడి చేశాడు. సతీష్ గుడివాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం

వంతెనలపై పొంచి ఉన్న ప్రమాదాలు

గుడ్లవల్లేరు: మండలంలో ఇరిగేషన్, మురుగు కాల్వల వంతెనలకు ఇరు వైపులా ఉన్న రైలింగులు తుప్పు పట్టి పాడైపోయాయి. ఈ రైలింగులు విరిగి పడిపోతున్నా పట్టించుకునే అధికారులే కరువయ్యారు. అసలు రైలింగులే లేకుండా పోయిన వంతెనలు ఉన్నాయంటే ఏ మాత్రం అతిశయోక్తి కాదు. వంతెనలు కూడా పాడైపోయి శిథిలావస్థకు చేరినా పట్టించుకున్న నాథుడే లేడు. ముఖ్యంగా వాహన చోదకుల తమ ప్రయాణాల రాకపోకల్లో ఈ వంతెనల వద్ద సరైన రైలింగ్‌లు లేకపోవటంతో ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు. కాస్త అదుపు తప్పితే ప్రాణాలపై ఆశ వదులుకోవలసిందే. ఈ వంతెనలు వివిధ గ్రామాలను కలిపే ప్రధాన రహదారులు కావటం విశేషం.

రాత్రి వేళల్లో ప్రమాదాలు

రోడ్లలోని మలుపుల్లో రైలింగ్ లేని వంతెనలు ఉండటంతో రాత్రి వేళల్లో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహన చోదకులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఈ వంతెనలను వెంటనే నిర్మించాలని అధికారులను ఆయా ప్రాంతాల వాహనచోదకులు కోరుతున్నారు.



పురిటిపాడు-కట్టవానిచెరువు రోడ్డులో రైలింగ్ లేని వంతెనపై బైకిస్టుల ప్రయాణం



దగ్గుమిల్లి-జేమ్స్‌పేట రోడ్డులో రైలింగ్ లేని వంతెనపై వెళ్తున్న వ్యాన్



పెంజెంద్ర-గుడ్లవల్లేరు రహదారిలో ప్రమాదపుటంచున కారు ప్రయాణం

కూలే స్థితిలో ఉన్నా పట్టించుకోరా?



పలు గ్రామాల్లో వంతెనలు కూలిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పురిటిపాడు నుంచి కట్టవానిచెరువు వచ్చే రహదారిలో వంతెనకు రైలింగ్ లేక ప్రయాణంలో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. దగ్గుమిల్లి నుంచి జేమ్స్‌పేట వచ్చే దారిలో కూడా ప్రమాదపుటంచున్న ప్రయాణాలు సాగిస్తున్నారు.

– ముక్కు సోమేశ్వరరావు,
శేరీ దగ్గుమిల్లి ఎంపీటీసీ సభ్యుడు, గుడ్లవల్లేరు మండలం

వంతెనలు వెంటనే నిర్మించాలి



గుడ్లవల్లేరు మండలంలో ప్రధాన రహదారుల్లో శిథిలావస్థకు చేరుకున్న వంతెనలను వెంటనే నిర్మించాలి. అవి నిర్మించకపోతే కూలిపోయే ప్రమాదాలు కూడా ఉన్నాయి. పెంజెంద్ర నుంచి గుడ్లవల్లేరు వెళ్లే రహదారిలో వంతెనకు ముందుగా కనీసం రైలింగ్‌ను నిర్మించకపోతే రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశముంది.

– బలుసు శ్రీసంధ్య,
వైఎస్సార్ సీపీ నాయకురాలు, పెంజెంద్ర, గుడ్లవల్లేరు మండలం

మొక్కుబడిగా ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు

2.50 లక్ష్యల కూబిక్ మీటర్ల ఇసుక లక్ష్యంగా..

తోట్లవల్లూరు: ఇసుక తవ్వకాల అనుమతుల మంజూరు కోసం కాలుష్య నియంత్రణ మండలి చేపట్టిన పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు తూతూ మంత్రంగా జరిగింది. ప్రజలకు, కార్మికులకు, మీడియాకు సరైన సమాచారం లేకుండా అధికారులు మొక్కుబడిగా ప్రజాభిప్రాయాలు సేకరించారనే విమర్శలున్నాయి. నార్తువల్లూరు రెవెన్యూ ఏరియాలో ఆర్ఎస్ నంబరు445లో 25 హెక్టార్ల ఇసుక తవ్వకాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు మంగళవారం జరిగింది. స్థానిక నార్తువల్లూరు సచివాలయ ఆవరణలో ఉయ్యూరు ఆర్డీఓ హేలా షారోన్ ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సదస్సు నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ నార్తువల్లూరు క్వారీలో 25 హెక్టార్లలో ఇసుక తవ్వకాల నిర్వహణకు ప్రజాభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఏడాదికి 2.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలు జరపనున్నట్లు చెప్పారు. ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని పేర్కొన్నారు.



తోట్లవల్లూరులో ఆర్డీఓ హేలా షారోన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ రాధిక

ప్రజల ప్రాణాలకు రక్షణ ఏదీ?

అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న ఇసుక రవాణతో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని తోట్లవల్లూరు సర్పంచ్ పెనుమత్స రాధిక పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణ జరగటంతోపాటు దుమ్ము, ధూళితో ప్రజలు దీర్ఘకాలిక రోగాలకు గురయ్యే ముప్పు పొంచి ఉందన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలంటూ ఆర్డీఓ హేలా షారోన్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. సమావేశంలో తహసీల్దార్ కుసుమకుమారి, మైనింగ్ అసిస్టెంట్ జియాలజిస్టు కొండారెడ్డి, వీఆర్ఓలు జయలక్ష్మి, వీరాస్వామి, బసవారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలి

గుడివాడరూరల్: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత శేరీగొల్వేపల్లి ఎంపీటీసీ సభ్యుడు అంగడాల శ్రీరామాంజనేయులు గొల్వేపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీఓ విష్ణుప్రసాద్ స్పందిస్తూ ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, త్వరలోనే రహదారి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం తొలగింపు పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని ప్రజలకు తాగునీరు సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ మాట్లాడుతూ మండలాభివృద్ధికి జెడ్పీ నిధులు తీసుకొచ్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో జిల్లా పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి డాక్టర్ నరసింహులు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఏఓ బోలెం అనంతలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గద్దే పుష్పరాణి

అడుసుమిల్లి కృషితో గుడ్లవల్లేరుకు కీర్తి

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు గ్రామాభివృద్ధిని చేసి జాతీయ స్థాయిలో ఆనాడు గుర్తింపు తెచ్చిపెట్టిన ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత అడ్సుమిల్లి అశ్వర్థ నారాయణమూర్తి చిరస్మరణీయులని మేనేజింగ్ ట్రస్టీ వల్లూరుపల్లి రామకృష్ణ పేర్కొన్నారు. గుడ్లవల్లేరు పాలిటెక్నిక్‌లో మంగళవారం నారాయణ మూర్తి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడ్లవల్లేరు అభివృద్ధిలో భాగంగా గ్రామంలో సాంకేతిక విద్యా వ్యాప్తికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి నారాయణ మూర్తి అని ట్రస్ట్ సభ్యుడు వల్లభనేని సుబ్బారావు అన్నారు. అనంతరం పేదలు, దివ్యాంగులు, రోగులను ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కేవీ కృష్ణారావు, పొట్లూరి రవి, జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, కాలేజీల ప్రిన్సిపాల్స్ ఎన్.రాజశేఖర్, బి.కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఆర్థికసాయం చేస్తున్న మేనేజింగ్ ట్రస్టీ రామకృష్ణ

ఫార్మర్ ఐడీని తప్పనిసరిగా పొందాలి

ఐనంపూడి(పామర్రు): మండలంలోని రైతులందరూ 11 అంకెల ఫార్మర్ ఐడీని తప్పని సరిగా పొందాలని పామర్రు ఏడీఏ స్వర్ణలత పేర్కొన్నారు. మండలంలోని అడ్డాడ, ఐనంపూడి గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు ఫార్మర్ ఐడీ పొందట వలన మాత్రమే పీఎం కిసాన్, వ్యవసాయశాఖ పథకాల లబ్ధి పొందగలుగుతారన్నారు. మినుము పైరులో సస్య రక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఏఓ శివనాగరాణి పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలి

మొవ్వ: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేయనున్న తరుణంలో ప్రతి ఒక్క రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను అందజేయనున్నట్లు ఏఓ కంచర్ల శివప్రసాద్ తెలిపారు. ఈ నెలాఖరులోపుగా సొంత పొలాలు కలిగిన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని కోరారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం లేదా ఆర్.ఓ.ఆర్.ఐ.బి కాపీతో పాటు ఆధార్ లింక్ అయిన ఫోను తీసుకువెళ్లి నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.



ఐనంపూడిలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ స్వర్ణలత

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: ప్రభుత్వ పథకాలు పొందడానికి వీలుగా విశిష్ట సంఖ్యను రైతులు నమోదు చేసుకోవాలని ఏఓ వేణుమాధవ్ కోరారు. మండలంలోని శ్రీహరిపురం, సింగరాయపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణామిల్క్ యూనియన్ వజ్రోత్సవాలు



విజయోత్సవాల్లో కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు సభ్యుడు కృష్ణారెడ్డి, మేనేజర్ గోపినాథ్



పాల క్యాన్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పామర్రు: పాడి రైతుల సంస్థ కృష్ణామిల్క్ యూనియన్‌ను పామర్రులో స్థాపించి 60 ఏళ్లు పూర్తిచేసి వజ్రోత్సవాలను జరుపుకుంటోందని కృష్ణామిల్క్ యూనియన్‌జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పాల సేకరణ కేంద్రం వద్ద మంగళవారం విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత పాడి రైతులతో కలిసి కేక్‌ను కట్‌చేశారు. అనంతరం రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మండలంలోని ఉండ్రపూడి, కనుమూరు తదితర గ్రామాల్లో వజ్రోత్సవ వేడుకలను నిర్వహించారు. పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ సీహెచ్ దామోదర కృష్ణ గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులే కేంద్రాలకు వెన్నెముక

మొవ్వ: పాడి రైతులే కేంద్రాలకు వెన్నెముక అని పామర్రు పాలశీతల కేంద్రం మేనేజర్ చిత్తూరు దామోదర కృష్ణ గోపీనాథ్ పేర్కొన్నారు. కృష్ణ మిల్క్ యూనియన్ వజ్రోత్సవ వేడుకల సందర్భంగా మొవ్వ, పెదసనగల్లు, కారకంపాడు గ్రామాల్లోని రైతులకు పాల క్యాన్‌లను మంగళవారం పంపిణీ చేశారు. పాడి పరిశ్రమలో మూడు తరాలుగా కొనసాగుతున్న రైతులను సత్కరించారు. యూనియన్ జిల్లా డైరెక్టర్ కృష్ణారెడ్డి , సొసైటీ అధ్యక్షుడు మండవ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేయాలి



పామర్రు: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో వారికి ప్రత్యేక శిక్షణ తరగతులు జరుగుతున్నాయని, సాయంత్రం సమయాల్లో దాతలు స్పందించి అల్పాహారం ఏర్పాటు చేయాలని ఎంఈఓ–2 పద్మవాణి కోరారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న శిక్షణ తరగతులను ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్, వారాంత పరీక్షలతో బీజీ కారణంగా పాఠశాలలకు ఉదయం ఏడు గంటలకు వచ్చి, సాయింత్రం ఏడు గంటలకు ఇంటికి వెళుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సాయంత్రం అల్పాహారం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. దాతలు స్పందించి వారికి అల్పాహారం అందిస్తే మరింత ఉత్సాహంగా చదువుతారని తెలిపారు.

ఘంటసాలకు ఘన నివాళి



గుడివాడ టౌన్: సినీ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి మంగళవారం పట్టణంలో నిర్వహించారు. పట్టణ కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక రాజబాపయ్య చౌక్ వద్ద గల ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కర్ణాటక్, హిందుస్థానీ సంగీతంలో ప్రావీణ్యం పొందిన ఘంటసాల మధుర గాయాలు సమాజంలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పలువురు వక్తలు అన్నారు. సమాఖ్య గౌరవాధ్యక్షుడు బీవీ మోహన్ రెడ్డి, అధ్యక్షుడు వి.సత్యనారాయణ, కోశాధికారి ఎ. సాంబశివరావు, ఉపాధ్యక్షుడు ఎల్. రాధాకృష్ణ, బీవీ సత్యనారాయణ, పాత శ్యాము, నాగరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సామర్థ్యాలకు అనుగుణంగా బోధన

ముదినేపల్లి రూరల్ : విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేయాలని ఎంఈఓ సేవ్యా నాయక్ అన్నారు. పెయ్యేరు ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆంగ్లం, గణితం వంటి సబ్జెక్టులను సులభశైలిలో బోధించాలన్నారు. హెచ్ఎం బేతాళ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయుడు చక్రధర్ పాఠశాల ప్రగతిని వివరించారు.

పేకాట శిబిరంపై దాడి

పోలీసుల అదుపులో ఏడుగురు

గుడివాడరూరల్: పేకాట శిబిరంపై గుడివాడ తాలూకా పోలీసులు మారువేషాల్లో వెళ్లి దాడి చేసి ఏడుగురు జూదరులను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.15,175, ఒక బైక్‌ను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఎన్.చంటిబాబు కథనం మేరకు తాలూకా పరిధిలోని పిన్నమనేని నగర్‌లో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ ఆదేశాలతో సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు పర్యవేక్షణలో సిబ్బందితో కలసి మారువేషాల్లో వెళ్లి పేకాట శిబిరంపై దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాపు సంఘం మండల అధ్యక్షుడిగా నందకిషోర్

మండవల్లి: మండల కాపు సంఘం అధ్యక్షుడిగా పెరికెగూడెంకు చెందిన చెన్నంశెట్టి నందకిషోర్ నియమితులయ్యారు. ఇటీవల పెడన నియోజక వర్గ నరసప్పచెరువులో కృష్ణా జిల్లా అధ్యక్షుడు కూనసాని నాగబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జాతీయ కాపు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్ల మురళీకృష్ణనాయుడు నుంచి నందకిషోర్ నియామక పత్రం అందుకున్నారు.

బుద్ధపౌర్ణమి వేడుకలను జయప్రదం చేయండి

గుడివాడ టౌన్: స్థానిక ముబారక్ సెంటర్ వద్ద గల బౌద్ధ ఆరామం వద్ద బుధవారం బుద్ధ పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు బౌద్ధ మహాసభ సభ్యులు పొంగులేటి జయరాజు తెలిపారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు బౌద్ధుల సమక్షంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేడుకల్లో మహాసభ కోశాధికారి ఏవీ రాజు, జిల్లా ఎస్సీ గంగాధరరావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. బౌద్ధమత, అంబేద్కర్ అభిమానులు, దళిత నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేపు సత్యదేవుని సన్నిధిలో అన్నసమారాధన

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం వేలాది మంది భక్తులకు అన్న సమారాధను చేపడుతున్నారు. గుడ్లవల్లేరు నెహ్రూ పశువుల సంత కమిటీ, సంత వ్యాపారులు సంయుక్త సహకారంతో గ్రామ భక్త బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

కల్యాణం.. కమనీయం



కైకలూరు: స్థానిక శ్యామలాంబ ఆలయ ఆవరణలో మంగళవారం రామలింగేశ్వర, రామేశ్వర స్వామి వార్ల వార్షిక కల్యాణం వైభవంగా నిర్వహించారు. గొర్తి ప్రభాకర దీక్షితులు, గురజాడ ఉదయశంకర్ దంపతులు కల్యాణ క్రతువును నిర్వహించారు. ఈఓ వీఎన్‌కే.శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

తోట్లవల్లూరు: ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని యాకమూరు వద్ద జరిగింది. తోట్లవల్లూరు పీఏసీఎస్ సీఈఓ వల్లూరు దయాకర్ బైక్‌పై మంగళవారం ఉయ్యూరు నుంచి తోట్లవల్లూరు వస్తున్నాడు. యాకమూరు శ్రీనగర్ కాలనీ సమీపంలోకి రాగానే వెనుక వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ ఆయన్ను ఢీకొట్టి పంట బోదెలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దయాకర్ గాయాలు కావటంతో 108 వాహనంలో ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ పవన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద ప్రాంతాన్ని పమిడిముక్కల సీఐ చిట్టిబాబు సందర్శించి పరిశీలించారు.

విద్యుత్ చౌర్యం సామాజిక నేరం



గుడ్లవల్లేరు: విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలో మంగళవారం ఈఈ శ్రీనివాసరావు, విజిలెన్స్ ఈఈ సీహెచ్.వాసు ఆధ్వర్యంలో 40 బృందాలుగా అధికారులు విద్యుత్ విజిలెన్స్ తనిఖీలను చేపట్టారు. మండలంలో సుమారు రూ.12.41లక్షల జరిమానాలు విధించినట్లు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ చౌర్యం ఎవరు చేసినా తమ శాఖకు సమాచారం ఇవ్వాలని ఈఈ కోరారు. 94408 12091, 94408 12086కు సమాచారం తెలపవచ్చని పేర్కొన్నారు. తనిఖీల్లో డీఈఈ పి.కిరణ్‌బాబు, ఏఈ ఎస్.వరకుమార్, గుడివాడ డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శ్రీరాములుకు డీఎన్నార్ పరామర్శ



ముదినేపల్లి రూరల్ : స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు మేకా శ్రీరాములును పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) మంగళవారం పరామర్శించారు. శ్రీరాములు ఇటీవలనే అస్వస్థతకు గురికాగా సమాచారం తెలుసుకున్న డీఎన్నార్ ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ పార్టీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్‌తో కలిసి పరామర్శించారు. నాయకులు మోట్రు ఏసుబాబు, బత్తిన కిషోర్, శీలం రామకృష్ణ, రాచూరి మోహన్, కొల్లి నాని ఉన్నారు.

నేడు పెద్దింట్లమ్మ తల్లి దేవస్థాన హుండీల లెక్కింపు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీలను బుధవారం ఉదయం 10 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి దేవదాయ శాఖ గుడివాడ తనిఖీ అధికారి విచ్చేస్తారని పేర్కొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్ : ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ ఆర్ గంగాశ్రీదేవి పర్యవేక్షణ చేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.3 లక్షల విరాళం



సీఐకి నగదు అందిస్తున్న గోల్డ్ ఫైనాన్స్ దుకాణదారులు

కైకలూరు: కైకలూరు పట్టణాన్ని జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుని సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని పట్టణ సీఐ పి.కృష్ణ పేర్కొన్నారు. పోలీసుస్టేషన్‌లో గోల్డ్ ఫైనాన్స్ దుకాణ యజమానులకు మంగళవారం సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం సీసీ కెమెరాల నిమిత్తం గోల్డ్, గోల్డ్ ఫైనాన్స్ దుకాణదారులు రూ.3 లక్షలను విరాళంగా అందించారు. సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు సహాయం అందించేవారు 94407 96434, 94407 96433లో సంప్రదించాలని కోరారు. పట్టణ ఎస్ఐలు డి.వెంకట్‌కుమార్, ఆర్.శ్రీనివాస్, బులియన్ మర్చంట్స్ అధ్యక్షుడు జవ్వాజి శ్రీనివాసరావు, పాన్ అసోషియేషన్ అధ్యక్షుడు కొనిజేటి నారాయణ, సభ్యులు గుర్రం రాంబాబు, బచ్చు నరసింహారావు, మురళీ, మెంటా దిలీప్, బొగ్గవరపు శ్యామ్ పాల్గొన్నారు.